క్లుప్తంగా

25 శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్



మాగనూర్: లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) అమల్లో భాగంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ఎంపీడీఓ రహ్మతుద్దీన్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు కల్పించిందన్నారు. ఎల్ఆర్ఎస్ రుసుంలో 25శాతం రాయితీ ప్రభుత్వం ఇచ్చిందని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్చి 31లోగా ఈ రిజిస్ట్రేషన్లను పూర్తి చేసుకున్న వారికి ఎల్ఆర్ఎస్ ఫీజులో రాయితీ వర్తిస్తుందన్నారు. మండల వ్యాప్తంగా ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న ప్లాట్ యాజమానుల సంఖ్య 170 మంది ఉన్నారన్నారు. వారి కోసం ఎంపీడీఓ ఆఫీసులో ఆవరణలో ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



మద్దూరు: మండలంలోని రెనివట్ల ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు నారాయణ జ్యూవెలర్స్ యజమాని గోవిందు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు సాయికుమార్‌లు పరీక్ష ప్యాడ్లతో పాటు, పెన్నులు అందజేశారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి పైచదువుల కోసం రూ.10 వేలు అందజేయనున్నట్లు గోవిందు ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజునాయక్ ఉపాధ్యాయులు వీరయ్య, బాలరాజ్, సతీష్, బ్రహ్మయ్య, సాయికుమార్, భానుప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారుడికి అభినందన



మద్దూరు: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఎస్‌జీఎఫ్ అండర్– 14 ఫుట్‌బాల్ విభాగంలో ప్రతిభ కనబర్చిన మద్దూరు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి కే.రమేష్‌ను సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. నాలుగు రోజులుగా వనపర్తి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పాలమూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించినట్లు ఫిజికల్ డైరెక్టర్ వెంకటప్ప తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఈ విద్యార్థి మెరిట్ సాధించడంపై పాఠశాల హెచ్ఎం సవిత, ఉపాధ్యాయులు అభినందించారు.

ఫోన్‌లోనే ఫిర్యాదు చేయొచ్చు

మరికల్: వివిధ సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు ఇక నుంచి స్టేషన్‌కు రాకున్నా అక్కడి నుంచే ఫోన్ చేయాలని ఎస్ఐ రాము అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మరికల్ పోలీస్‌స్టేషన్‌లో ల్యాండ్ లైన్‌కు బదులు కొత్తగా 8712671018 నంబర్‌కు ఫోన్ చేయాలని మండల ప్రజలకు సూచించారు. ఎక్కడైనా అలర్లు, ప్రమాదాలు, ఇతర ఘటనలు ఏవైనా జరిగిన ఇదే నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. వెంటనే సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుంటారన్నారు.

కొరవడిన భద్రత

నర్వ: రాష్ట్ర ప్రభుత్వం భద్రత లోపం కారణంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఎంపీ డీకే అరుణ ఇంట్లో అగంతకుడు చొరపడ్డారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తి అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి సుమారు గంటన్నరపాటు అన్ని రూమ్‌లు కలియతిరిగి బయటకు వెళ్లడం ముమ్మాటికి భద్రతాలోపమే అని పేర్కొన్నారు. పార్లమెంటు సభ్యురాలు, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు అయిన ఆమెకే భద్రత కల్పించకపోతే సామాన్య మహిళలకు ఎలా భద్రత కల్పిస్తారని దుయ్యబట్టారు. సంఘటనపై సమగ్ర విచారణ చేసి భద్రతను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

వ్యక్తికి రిమాండ్

నర్వ: ఊట్కూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 5న, కానిస్టేబుల్‌పై దాడి కేసులో వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కృష్ణంరాజు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు ఈ నెల 5న, ఊట్కూర్ చెరువు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కానిస్టేబుల్ పట్టుకున్నాడు. ఈ సంఘటనలో యజమాని చాకలి శ్రీను కానిస్టేబుల్‌పై దాడి చేసి ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. దీంతో అతనిపై కానిస్టేబుల్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి అతనిని రిమాండ్‌కు తరలించారు.

మరమ్మతుకు నోచని కల్వర్టులు

- మరికల్ నుంచి నారాయణపేట వరకు శిథిలావస్థకు చేరిన వంతెనలు
- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



అప్పంపల్లి శివారులో రోడ్డుకు సమాంతరంగా ఉన్న కల్వర్టు

మరికల్: జిల్లాలో శిథిలమైన కల్వర్టు రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఈ విషయం తెలిసిన పీఆర్, ఆర్అండ్‌బీ శాఖలు నిద్ర మత్తును వీడటం లేదు. మరిన్ని ప్రమాదాలు జరగక ముందే అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు. జిల్లాలో 1,551.5 కిలోమీటర్లు ఆర్అండ్‌బీ రహదారి ఉంది. వాటికి తోడు 104.8 కిలో మీటర్లు జాతీయ రహదారి జిల్లా మీదుగా వెళ్తోంది. మరికల్ నుంచి నారాయణపేట వరకు ఉన్న ఆర్అండ్‌బీ రహదారి పై ఉన్న కల్వర్టులు శిథిలమయ్యాయి. గతంలో ప్రమాదాలతో దెబ్బతిన్న రక్షణ గోడల్ని మరమ్మతులు చేయకపోవడంతో ఇప్పుడు నామరూపాలు లేకుండా పోయాయి. తారురోడ్డుకు సమాంతరంగా తయారయ్యాయి. క్షుణ్ణంగా పరిశీలిస్తే తప్ప కల్వర్టున్నట్లు గుర్తించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. మక్తల్ నుంచి నారాయణపేట వయా ఊట్కూర్, నారాయణపేట నుంచి కోస్గి వయా దామరగిద్ద, మద్దూరు పరిధిలోని రహదారుల్లోనూ కల్వర్టులు మరమ్మతులకు వచ్చాయి. పీఆర్ రోడ్డులో కల్వర్టులతో పాటు మలుపులు ఉన్న చోట హెచ్చరిక బోర్డులు సైతం లేవు. ఇవన్నీ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇకనైనా పీఆర్, ఆర్అండ్‌బీ శాఖాధికారులు కల్వర్టుల మరమ్మతులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



కల్వర్టు గుంతలో పడ్డ కారు(ఫైల్)

ప్రమాదకారంగా..

మరికల్ నుంచి నారాయణపేట మధ్యన అనేక ప్రమాదకర కల్వర్టులున్నాయి. తరుచుగా వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారుల్లో చలనం లేదు. ఈ రెండు పట్టణా ల మధ్యన ఉన్న ప్రమాదకర కల్వర్టుల దగ్గర పదిమందికి పైగా మృతి చెందారు. అలాగే నారాయణపేట మండలం చిన్నజట్రం, పెద్దజట్రం మధ్యలో ప్రమాదకర కల్వర్టు ఉంది. ఇక్కడ రోడ్డుకు ఇరు వైపులా కల్వర్టు నిర్మించారు. రెండు వైపులా రక్షణ గోడలు ధ్వంసం కావడంతో తారు రోడ్డుకు సమాంతరంగా కల్వర్టు మారింది. ధన్వాడ కొత్త మసీద్, అంత్వార్ మందిపల్లి, శివారుల్లో శిథిలమైన రోడ్డుకు సమాంతరంగా మారాయి. ఈ కల్వర్టుల దగ్గర ప్రతినెల రెండు, మూడు ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

మరమ్మతు చేస్తాం..

శిథిలావస్థకు చేరిన కల్వర్టు నిర్మాణాలకు గతంలో నాలుగు సార్లు టెండర్లు పిలవడం జరిగింది. ఎవరూ ముందుకు రాలేదు. టెండర్ వేసి మరమ్మతులు చేయిస్తాం.

– విష్ణు, ఆర్అండ్‌బీ ఏఈ

విద్యార్థులకు లక్ష్యం ఉండాలి



పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న జీహెచ్ఎం నాగరత్నమ్మ

మరికల్: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంపిక చేసుకొని ఆ దశగా ముందుకు సాగితే భవిష్యత్‌కు మంచి పునాది పడుతుందని జీహెచ్ఎం నాగరత్నమ్మ, ముఖ్యవక్త సుదర్శన్ అన్నారు. మరికల్ బాలుర ఉన్నత పాఠశాల్లో పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఇంటి దగ్గర సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి, వారిని ఏకాగ్రతతో చదివించాలన్నారు. అంతకు ముందు క్రీడ, వ్యాసరచన, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలి



ధన్వాడ: ప్రతి నీటిబొట్టు ఎంతో విలువైనదని, నీటి వృథాను ప్రతిఒక్కరు అరికట్టాలని బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం నరసింహచారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్సీఆర్టీ ఆదేశాల మేరకు నీటి సంరక్షణ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నీటివృథా అరికట్టాలని విద్యార్థులతో కలిసి పుర విధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో డిగ్రీ కళాశాల అధ్యాపకులు కేశవ్, రామ్‌రెడ్డి, లక్ష్మణ్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో నర్సింగరాజ్, సుభాషిని, వెంకటేష్, రామకృష్ణ, వసంతకుమారి పాల్గొన్నారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలివ్వాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మాగనూర్/దామరగిద్ద: మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షులు ఏజీ భుట్టో అన్నారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి ఎంపీడీఓ రహ్మతుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులకు రెండు నుంచి ఐదు నెలల పెండింగ్ వేతనాలు, వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రావిటీ, ఇన్సూరెన్స్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఆశప్ప, మండల నాయకులు రాకేష్, మారెప్ప, నర్సింహ పాల్గొన్నారు.

- దామరగిద్ద మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని టీయూసీఐ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ జిల్లా కార్యదర్శి నర్సింహులు, పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహదేవ్, సాయి, సలీం, మధు, రాజు, చాంద్ పాషా, వెంకటప్ప, లింగప్ప, సిద్దునాయక్, రవి, థామస్, రాకేష్‌లు పాల్గొన్నారు.

అమ్మాయిలను వేధిస్తే చర్యలు తప్పవు



కోస్గి: సమాజంలో అమ్మాయిలను వేధింపులకు గురి చేస్తే చట్టరిత్యా చర్యలు తప్పవని షీ టీం పోలీసులు బాలరాజు, చెన్నయ్యలు అన్నారు. సోమవారం గుండుమాల్ మండలంలోని బోగారం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, బ్లాక్‌మెయిల్, సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తే సహించేదిలేదన్నారు. అపరిచిత వ్యక్తులను నమ్మరాదని, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో షీ టీం సిబ్బంది, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలి



ఎక్కామేడ్ నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణారావు

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పెంచుతున్న నర్సరీలను ఎంపీడీఓ కృష్ణారావు పర్యావేక్షించారు. ఎండాకాలం తీవ్రమవుతున్న నేపథ్యంలో మొక్కలకు తగినంత నీటి సౌకర్యం కల్పించాలని, చనిపోయిన మొక్కల స్థానంలో విత్తనాలు తిరిగి నాటాలని, వచ్చే వర్షాకాలం నాటికి ఎంచుకున్న లక్ష్యం మేరకు మొక్కలు సిద్ధం చేయాలన్నారు. ఎండ తగలకుండా మొక్కలపై షాడో నెట్స్ ఏర్పాటు చేసుకోవాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఉపాధి పని చేస్తున్న కూలీలకు తాగు నీరు, షాడో నెట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న నిర్మాణ పనులు



ఆలయ ప్రాంగణంలో సెప్టిక్ ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: గిరిజన ఆరాధ్య దైవం గురులోకామసంద్ బావాజీ ఉత్సవాలు వచ్చే నెల 11 నుంచి ప్రారంభం కావడంతో ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ)ఆదేశాల మేరకు సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కృష్ణారావుఆలయ పరిసరాల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆలయ పరిధిలో నిర్మాణమైన తాత్కాలిక మరుగుదొడ్లను శాశ్వతంగా నిర్మిస్తున్న సెప్టిక్ ట్యాంక్ పనులను పరిశీలించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. జాతరకు వారం రోజుల ముందుగానే పారిశుద్ధ్య పనులు పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి రవీందర్‌ను ఆదేశించారు.

విద్యుదాఘాతంతో లారీలో చొప్ప దగ్ధం



మద్దూరు: దోరేపల్లి శివారు ప్రాంతాల్లో చొప్పను సేకరించి లారీలో లోడ్ చేసుకొని వెళ్తున్న క్రమంలో విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో చొప్ప దగ్ధమైన సంఘటన మండలంలోని దోరేపల్లి శివారులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. దోరేపల్లి, జాధరావ్‌పల్లి గ్రామాల పరిధిలోని పొలాల్లో జొన్నచొప్పను మహబూబ్‌నగర్ చెందిన ఓ వ్యాపారి సేకరించి లారీలో తరలిస్తున్నాడు. ఈ క్రమంలో దోరేపల్లి జాధార్‌పల్లి రోడ్డులోని మూల మలుపు దగ్గర 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి చొప్ప దగ్ధమైంది. దీంతో అక్కడే ఉన్న బోరు నీటితో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. నారాయణపేట అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించడంతో అక్కడి చేరుకొని మంటలు ఆర్పేశారు. దీంతో చొప్ప మాత్రమే కాలిపోయింది.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



సాక్షి, నెట్‌వర్క్: కోస్గి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు బోధన చేశారు.

- ధన్వాడ మండల కేంద్రంలోని పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు.
- మాగనూర్ మండలంలోని వడ్వాట్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవం, పది విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మురళీధర్‌రెడ్డి మాట్లాడారు.
- దామరగిద్ద మండలంలోని సజనాపూర్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి

నారాయణపేట రూరల్: పాఠశాలల్లో విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని మాజీ ఎంపీటీసీ కెంచే శ్రీనివాస్ అన్నారు. మండలం లోని కోటకొండ జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడారు. కార్యక్రమంలో జీహెచ్ఎం సునీత, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, ఏఏపీసీ చైర్మన్ లక్ష్మి, బ్యాంకు మేనేజర్ ప్రవీణ్, భారతి, కుర్మయ్య, రామకృష్ణ, మల్లేష్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభిస్తున్న కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

కోస్గి రూరల్: తెలంగాణ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కృషి చేసి, వారిలో ఆర్థికస్వావలంబన పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు ఆత్మగౌరవంతో ఏదిగేందుకు ఆరుగ్యారంటీలను అమలు పరిచారన్నారు. ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంక్‌ల నిర్వహణ చేపట్టి స్వయం శక్తితో ముందుకు రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రసన్నరెడ్డి, మాస్టర్ శ్రీనివాస్, బాలేష్, భానునాయక్, నాగులపల్లి నరేందర్, అన్నకిష్టప్ప, టింటు నర్సింహ ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



ముశ్రీఫాలో భోజనం పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

కోస్గి రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం తాజా కూరగాయలతో నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ బక్క శ్రీనివాసులు, మండల విద్యాధికారి శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని ముశ్రీఫా ఉన్నత పాఠశాల, సర్జఖాన్‌పేట్ గ్రామంలోని ఉర్దూమీడియం ప్రాథమిక పాఠశాలలను వారు ఆకస్మికంగా సందర్శించారు. భోజనశాలలో బియ్యం నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం తాజా కూరగాయలతో పాటు గుడ్లు, అరటిపండ్లు అందించాలన్నారు. పాఠశాల పరిసరాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులతో పాటు సహపంక్తి భోజనం చేశారు. అనంతరం పలు రికార్డులు, ఫుడ్ కమిటీలను పరిశీలించారు. ఆర్ఐ లింగారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఎస్సీ ఉప కులాలకు న్యాయం చేయాలి



రిలే దీక్షల్లో పాల్గొన్న నాయకులు

దామరగిద్ద: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి ఎస్సీ ఉప కులాలకు న్యాయం జరిగేలా రిజర్వేషన్ కల్పించాలని మాజీ ఎంపీపీ నర్సప్ప, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు రాములు, ప్రధాన కార్యదర్శి నరేందర్‌లు డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ చౌరస్తాలో కొనసాగిన రిలే దీక్షల్లో వారు పాల్గొని మాట్లాడారు. వర్గీకరణతో ఉప కులాలకు న్యాయం చేసే వరకు ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయరాదని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బిల్లు ఆమోదింపజేసిన తరువాతనే ఫలితాలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో గోపాల్, గజలప్ప, కందెన్‌పల్లి, మద్దెల్‌బీడ్ దామరగిద్ద గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఏఐ తోడుంటే గణితం సులువే



పెద్దకడ్మూర్ పాఠశాలలో ఏఐ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న క్లస్టర్ జీహెచ్ఎం భాగ్యలక్ష్మి

నర్వ: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే గణితమంటే భయం లేకుండా సామాన్య శాస్త్రమంటే మక్కువ పెరిగేలా కృత్రిమ మేధ(ఏఐ) సహకారం తీసుకుంటున్నామని పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాల జీహెచ్ఎం భాగ్యలక్ష్మి అన్నారు. పైలెట్ ప్రాజెక్టులో బాగంగా మంజూరైన ల్యాబ్‌ను సోమవారం పెద్దకడ్మూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీఎస్ హెచ్ఎం మణెమ్మ, ఉపాధ్యాయులు అనిల్, మాధవి, ముబీన్, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంలో ఆశల పాత్ర కీలకం



మక్తల్ తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

నారాయణపేట టౌన్/మక్తల్/నర్వ: ప్రజారోగ్య రక్షణలో ఆశల పాత్ర కీలకమని సీఐటీయూ మండల అధ్యక్షురాలు పద్మ, కార్యదర్శి మణెమ్మ అన్నారు. సోమవారం నర్వ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సీఐటీయూ అనుబంధ ఆశా కార్యకర్తల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మల్లారెడ్డికి అందించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ప్రజారోగ్య రక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న ఆశలకు నేటికి కనీస వేతనం మంజూరు కావడంలేదన్నారు. కార్యక్రమంలో నాయకురాలు మణెమ్మ, ప్రమీల, తిరుపతమ్మ, పార్వతమ్మ, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

- ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మక్తల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోవిందురాజ్ మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గోవిందమ్మ, అమానాబేగం, యశోద, ఇందిర, అనిత, పార్వతమ్మ, వెంకట్‌లక్ష్మి, వెంకటమ్మ, సుజాత, పద్మ, లక్ష్మి, రసీదా పాల్గొన్నారు.

ఉపాధి హామీ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

నారాయణపేట: గ్రామీణ ఉపాధిలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వాచర్స్, వనసేవకుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ దగ్గర సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మొక్కల పెంపకంలో ప్రధాన పాత్ర వహిస్తున్న వాచర్స్, నర్సరీల్లో పనిచేస్తున్న వనసేవకులకు రోజు వేతనం రూ.600 లు ఇవ్వాలని, పర్మినెంట్ జాబ్ కార్డ్స్ ఇవ్వాలన్నారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ వేసవిలో ఎండలు తీవ్రతరం అవుతున్నాయని, పని ప్రదేశాల్లో నీడ కోసం టెంట్లు, మంచినీళ్ల అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ మొగులప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బాలప్ప, శివకుమార్, భింషన్, మొగులప్ప, భాస్కర్, అశోక్, కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ఉపసంహరించుకోవాలి

నారాయణపేట టౌన్: ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసి పీఎం శ్రీ మోడల్ కేంద్రాలు ఏర్పాటు చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వెంకట్‌రామిరెడ్డి డిమాండ్ చేశారు. నూతన విద్యావిధానం పేరుతో అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే పనులు విరమించుకోవాలన్నారు. సోమవారం మున్సిపల్ పార్కువద్ద అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరామ్, పలువురు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



నారాయణపేట రూరల్: రైతుల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం సదాశివరెడ్డి అన్నారు. మండలంలోని కొల్లంపల్లి గ్రామ శివారులోని పలువురు రైతుల పొలాలకు వెళ్లేందుకు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి నిధులతో మంజూరు చేసిన మట్టి రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ కో ఆప్షన్ ఎండీ గౌస్, మాజీ ఎంపీటీసీ జనార్దన్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.